

ఓం నమో భగవతే శ్రీ రమణాయ

# రమణ భాస్కర



వ్యవస్థాపక సంపాదకులు : బి. వి. ఎల్. ఎన్. రాజు

సంపుటి : 29 | సంచిక : 4 | డిసెంబర్ 2023

రమణ భాస్కర

ఆధ్యాత్మిక మాస పత్రిక

పేజీలు : 32

గౌరవ సంపాదకులు

శ్రీమతి P. H. V. సత్యవతి (హైమ)

చందా

సంవత్సర చందా:రు॥ 150/-

విడి ప్రతి : రు॥ 15/-

చిరునామా

రమణ భాస్కర

శ్రీ రమణ క్షేత్రం,

జిన్నూరు – 534 265

ప॥గో॥ జిల్లా, ఆం॥ప్ర॥

పబ్లిషర్

సద్గురు శ్రీ నాన్నగారు

శ్రీ రమణ క్షేత్రం

జిన్నూరు – 534 265

9441122622

7780639977

ప్రింటర్

శ్రీ భవాని ఆఫ్‌సెట్ ప్రింటర్స్

(దుడే శ్రీను) ఎస్. వి. ఆర్. కాంప్లెక్స్,

పాలకొల్లు, 9848716747

డిజైనింగ్

అనన్య జిరాక్స్ & నెట్ సెంటర్

(నందిగామ శేషసాయి)

పి. పి. రోడ్డు, లజపతిరాయ్ పేట,

పాలకొల్లు, 9397151342

## ఈ సంచికలో. . . .

రమణ సిద్ధాంతం ........................................ 2

సద్గురు శ్రీనాన్నగారి అనుగ్రహభాషణములు ................ 5

**ఇతర విషయములు :**

చావలి సూర్యనారాయణమూర్తి గారి వ్యాసం

సాగిరాజు రామకృష్ణంరాజు గారి వ్యాసం



**కోరికకు శక్తి లేదు. శక్తి ఈశ్వరుడిది. ఆయన ఆజ్ఞను అనుసరించి అది నెరవేరుతుంది కాని నీ కోరికని బట్టి నెరవేరదు.**

ఓం శ్రీనాన్న పరమాత్మనే నమః

# సద్గురు శ్రీనాన్నగారి అనుగ్రహభాషణములు - 20 అక్టోబర్ 1995, జిన్నూరు

ప్రియమైన ఆత్మబంధువుల్లారా!

మన మనసుని మనం స్వాధీనం చేసుకోవటానికి మన తెలివితేటలు ఒక్కటే సరిపోవు, మన ప్రయత్నం ఒక్కటే సరిపోదు, ఈశ్వర అనుగ్రహం కూడా ఉండాలి. గురువు మీద శ్రద్ధ, దేవుడి మీద శ్రద్ధ, శాస్త్రం మీద శ్రద్ధ కలిగి ఉండడం వల్ల కూడా మనకి బ్రహ్మానుభవం కలుగుతుంది, ఆత్మానుభావం కలుగుతుంది. వాళ్ళ పట్ల శ్రద్ధ కలిగి ఉండాలి. పెద్దల పట్ల, శాస్త్రం పట్ల, గురువు పట్ల, దేవుడి పట్ల ప్రీతి కలిగి ఉండాలి, ఆప్యాయత కలిగి ఉండాలి. అంటే మనకి బ్రహ్మానుభవం కలగడం కోసం, జ్ఞానం కలగడం కోసం ఆ శ్రద్ధ కూడా సహాయం చేస్తుంది. శ్రద్ధ వలన మాత్రమే జ్ఞానం కలుగుతుంది అని పరమేశ్వరుడు గీతలో చెప్పాడు. శ్రద్ధావాన్ లభతే జ్ఞానం, శ్రద్ధ వల్ల మటుకే మీకు జ్ఞానం కలుగుతుంది, శ్రద్ధ అవసరం అన్నారు. శ్రద్ధ అనే రెండు అక్షరాలు మనం అర్థం చేసుకుని, అవగాహన చేసుకుని, దాని తాత్పర్యం మనం జీర్ణం చేసుకుంటే మనం ఒడ్డుకి వచ్చేసినట్టే. అంటే శ్రద్ధ వల్ల అజ్ఞానం నశిస్తుంది, అహంభావం నశిస్తుంది.

ఈశ్వరుడు ఎక్కడ ఉన్నాడు అంటే మన హృదయంలోనే ఉన్నాడు. చైతన్య రూపంలో అందరి హృదయాలలోనూ ఉన్నాడు. ఆ చైతన్యం అనుభవంలోకి వచ్చే వరకు మనకి ప్రయత్నం పూర్తి కాదు. మనం చేస్తున్న సాధన పూర్తి కాదు. బేధబుద్ధి ఉంటే చైతన్యం అనుభవంలోకి రాదు. చైతన్యం ఒకటిగా ఉంది కానీ, రెండుగా లేదు. ఆ చైతన్యం మనకి అనుభవంలోకి రావాలి. నిజమైన నేనే చైతన్యం, అబద్ధమైన నేనే అహంభావం. భగవాన్ అన్నారు ఒకటి పట్టుకోవాలి, రెండోది విడిచి పెట్టాలి అన్నారు. మనం పట్టుకోవాల్సింది విడిచి పెట్టేస్తున్నాం, వదిలి పెట్టేయాల్సింది ఏమో పట్టుకుంటున్నాం. అబద్ధమైన నేను ఉంది, నిజమైన నేను ఉంది మనకి. అబద్ధమైన నేనుని వదిలి పెట్టాలి, నిజమైన నేనుని పట్టుకోవాలి. మనం ఏమి చేస్తున్నాం అంటే అబద్ధమైన నేనుని పట్టుకుంటున్నాం, నిజమైన నేనుని వదిలేస్తున్నాం. అంటే వదిలేయవలసిన దానినేమో పట్టుకున్నాం, పట్టుకోవాల్సిన దానిని వదిలేస్తున్నాం. మనం మర్చిపోయే విషయాలు మర్చిపోవాలి, జ్ఞాపకం పెట్టుకోవాల్సిన విషయాలు జ్ఞాపకం పెట్టుకోవాలి. మనకి ఉపయోగం లేని విషయాలు అన్నీ జ్ఞాపకం పెట్టుకుని వాటిని మోస్తూ ఉంటాం. ఇటువంటి లోపాలు మనం సవరించుకోవాలి. మీరు కంగారు పడక్కర్లేదు మీకు జ్ఞానం వస్తుంది, ఈ శరీరంలో ఉండగానే వస్తుంది. అది అన్వేషణ యొక్క తీవ్రతని బట్టి, సాధన యొక్క తీవ్రతని బట్టి వస్తుంది. కొంతమంది వందజన్మలలో చేసే సాధన

ఒక్కజన్మలో చేసేస్తారు. అంటే ఆ సాధనలో ఉన్నటువంటి తీవ్రత, ఆ intensityని బట్టి అది వస్తుంది. ఏమి లేదు మన శరీరం ఉండగానే ముక్తిని సంపాదించాలి. శరీరం ఉండగా సంపాదిస్తే జీవన్ముక్తి అంటారు. వాడే శరీరాన్ని విడిచి పెట్టేస్తే వాడిని విదేహముక్తుడు అంటారు. ముక్తి అంతా సమానంగానే ఉంటుంది. దేహం ఉండడం, ఊడిపోవడం తోటి ముక్తికి సంబంధం లేదు.

చావు ఎటువంటిది అంటే వంతెన లాంటిది. కాలువని దాటటానికి బ్రిడ్జి ఏ విధంగా ఉపయోగపడుతుందో మనకి అలాగే పాత శరీరాన్ని తీసేసి కొత్త శరీరం ఇవ్వడం కోసం మనకి చావు కూడా సహాయపడుతుంది. మరణం అంటే మీరు ఏమి కంగారు పడకండి, ఎన్ని వేలజన్మలు మార్చుకుంటూ, ఎన్ని వేల శరీరాలు మార్చుకుంటూ ఇక్కడకి వచ్చామో, మీరు గ్రహించవలసిన విషయం ఏమిటి అంటే, ఉన్నది ఎప్పడూ ఉంది. ఉన్న దానికి లేకపోవడం అంటూ లేదు. మనకి తెలిసున్నా ఉంది, మనకి తెలియకపోయినా ఉంది. బేధం అంతా మనస్సు యొక్క కల్పన. రాగం ఉన్న చోట కామం వస్తుంది, ద్వేషం ఉన్నచోట కోపం వస్తుంది. రాగద్వేషాల వల్ల మనం బాధ పడుతున్నాం అంటే అదొక శాపం మనకి. సమాజపరంగా కానీ, కుటుంబపరంగా కానీ రాగద్వేషాలు ఉపద్రవాలు తెచ్చిపెడుతున్నాయి. మనస్సు అంతర్ముఖంగా ప్రయాణం చెయ్యడానికి సిద్ధపడినా రాగద్వేషాలు బయటకి లాక్కొచ్చేస్తున్నాయి. అవి శాపాలు కింద తయారు అయ్యాయి మనకి, భగవంతుడిని ప్రార్థించి వాటిని ఊడగొట్టుకోవాలి. అదే మనం చేయవలసిన సాధన. రాగద్వేషాలు పుడుతున్నాయి అంటే అజ్ఞానం ఉన్నట్టే లెక్క. అందుచేత వాటిని ఊడగొట్టుకోవాలి. ఆ రాగద్వేషాలే మనకి బేధబుద్ధిని తీసుకు వస్తున్నాయి. బేధబుద్ధి మనకి ఉన్నంతకాలం మరణాలు వస్తాయి,జన్మలు వస్తాయి. శరీరం పుడుతుంది, దానికి వార్ధక్యం వస్తుంది, మరణిస్తుంది. శరీరం యొక్క స్వభావం. శరీరం చనిపోవడానికి మనం ఏమి సాధన చెయ్యక్కర్లేదు. సాధన చెయ్యవలసింది దేనికి అంటే ఆ దేహబుద్ధి, ఆ శవబుద్ధి పోవడం కోసమే మనం సాధన చెయ్యాలి. సాధన యొక్క ప్రయోజనం అది. అంటే సాధన యొక్క ప్రయోజనం జ్ఞానాన్ని సంపాదించడం కాదు. జ్ఞానం అనేది సహజంగా మీ హృదయంలోనే ఉంది. ప్రత్యేకంగా నువ్వు సంపాదించక్కర్లేదు. ఒకప్పడు ఉండి, ఒకప్పడు పోయే వస్తువును నువ్వు సంపాదించినా దానిని ఏమి చేసుకుంటావు, దాని వలన ప్రయోజనం ఏమిటి అన్నారు ఆచార్యుల వారు. నువ్వు వేలకి వేలు డబ్బు సంపాదిస్తావు, నువ్వు కష్టపడి సంపాదించింది నాలుగు రోజులలో పోతుంది, అంత కష్టపడి నాలుగు రోజులలో పోగొట్టుకునే వస్తువు సంపాదిస్తున్నావు నువ్వు, దానివల్ల పెద్ద ప్రయోజనం ఏమిటి అన్నారు. నిత్యంగా ఉండేది, సత్యంగా ఉండేది, ఎప్పడు ఉండేది, నీ దేహం ఉన్నా, ఊడిపోయినా ఉండేది సంపాదించుకో

అన్నారు ఆచార్యులవారు. అది ఏకంగా ఉంటుంది, ఆనందంగా ఉంటుంది, శాంతంగా ఉంటుంది. జనన మరణాల తోటి దానికేమి సంబంధం లేదు. అది ఉండటం మనకి తెలుస్తూ ఉంటుంది.

మన హృదయంలో ఉన్న వస్తువు ఎప్పుడైతే మనకి స్పష్టంగా అనుభవంలోకి వచ్చిందో, మన హృదయంలో ఉన్న పరమేశ్వరుడు ఎప్పుడైతే మనకి స్పష్టంగా అనుభవంలోకి వచ్చాడో, దాని తాలుకు శాంతి, దాని తాలుకు ఆనందం, దాని తాలుకు చైతన్యం అంతా కూడా మనకి తెలుస్తూనే ఉంటుంది. చెప్పడు మాటల మీద ఆధారపడి ఉండక్కర్లేదు. స్పష్టంగా వస్తువు నీకు అనుభవంలోకి వచ్చినప్పుడు ఆనందం అంతా కూడా తెలుస్తూనే ఉంటుంది. ఆనందాలు అనేకం ఉన్నాయి కానీ అన్నిటికంటే బ్రహ్మానందమే గొప్పది. దానికి మించిన ఆనందం ఏమీ లేదు. విద్యలలో కూడా బ్రహ్మ విద్య గొప్పది. ఆనందాల్లో బ్రహ్మానందం గొప్పది. అయితే దానిని మనం సాధించడానికే ఈ దేహాన్ని మనం ఉపయోగించుకోవాలి, ఈ మనస్సుని మనం ఉపయోగించుకోవాలి. భగవంతుడు మనకి ఇచ్చిన అవకాశాలు బ్రహ్మానందం పొందడానికి ఉపయోగించుకోవాలి. భగవంతుడు మనకి ఇచ్చిన అవకాశాన్ని సద్వినియోగం చేసుకోకపోతే రాబోయేజన్మలలో కూడా మనకి అవకాశాలు ఇవ్వడు. ఇది బాగా జ్ఞాపకం పెట్టుకోండి. మనకి ఎటువంటి అవకాశాలు అయితే భగవంతుడు ఇచ్చాడో, అవి సద్వినియోగం చేసుకోవాలి. సద్వినియోగం చేసుకుంటే మనకి higher బర్త్ వస్తుంది. మనం సద్వినియోగం చేసుకోకపోతే మళ్ళీ మనం కిందకి జారిపోతాం, నీచజన్మలు వస్తాయి, చీకటి లోకాలకి వెళతాము. భగవంతుడికి ఒక జీవుడు మీద ఇష్టం, ఒక జీవుడు మీద అయిష్టం ఏమీ లేదు. వాడి కర్మని బట్టి వాడు నడిపిస్తూ ఉంటాడు. కష్టసుఖాలు మన తెలివితేటల వల్ల రావు. ప్రారబ్ధాన్ని బట్టి వస్తూ ఉంటాయి. కష్టం కూడా ప్రారబ్ధ ఫలమే, సుఖం కూడా ప్రారబ్ధ ఫలమే, సంతోషం కూడా ప్రారబ్ధ ఫలమే!

దేవుడిని ధ్యానం చెయ్యడం వలన చిత్తగతి మారుతుంది అని భాగవతంలో వాసుదేవస్వామి చెప్పారు. దేవుడిని ధ్యానం చెయ్యగా, చెయ్యగా నీ మనసు యొక్క గతి, మనస్సు ఎక్కడకి వెళుతోంది ఇప్పడు? బాహ్యముఖానికి వెళుతుంది. అంటే బ్రహ్మదేవుడు ఏమి చేసాడు అంటే మనసుని, ఇంద్రియాలని బాహ్యముఖానికి ఏర్పాటు చేశాడు. ఆ ఇంద్రియాలు యొక్క గతి, మనస్సు యొక్క గతి మారాలి అంటే భగవంతుడిని ఆశ్రయించి, భగవంతుడిని ధ్యానం చేసుకో, భగవంతుడి పాదాలను ఆశ్రయించు. అంటే నీకు ఏదైనా రోగం వస్తే ఔషధం పుచ్చుకుని ఎలా తొలగించుకుంటున్నావో, ఆ గతిని మార్చాలి అంటే, ఆ ప్రవాహాన్ని మార్చాలి అంటే ఈశ్వరుడిని ఆశ్రయించు. ఈశ్వరుడి రూపాన్ని ధ్యానం చేసుకో,

ఆ నామాన్ని స్మరించుకో, ఈశ్వరుడి పాదాలను విడిచి పెట్టకు. నీ చిత్తం యొక్క గతి మారుతుంది అని భాగవతంలో వాసుదేవస్వామి వారు చెప్పారు. భగవంతుడు ఏవైనా మనకి మంచి విషయాలు చెబితే అది జీర్ణం చేసుకుందాం అనే బుద్ధి మనకి కలగదు. వాటిని అర్థం చేసుకుంటే మన మనసులో మార్పు వస్తుంది. మారటానికే మనకి ఇష్టం లేనప్పుడు, అర్థం చేసుకోవడానికి ప్రయత్నం ఏమి చేస్తాం? మారుమనస్సు పొందాలి అని మనం ప్రయత్నం చేసేటప్పుడు, మన రోగం తగ్గాలి అనుకున్నప్పుడు ఔషధాన్ని ఏ విధంగా అయితే సేవిస్తామో అలాగే మనం బాగుపడాలి. ఆధ్యాత్మికంగా అభివృద్ధి పొందాలి, అనే కాంక్ష మనకి ఉన్నప్పుడు భగవంతుడు చెప్పే మంచి మంచి విషయాలు మనం విని అర్థం చేసుకుని అనుభవంలోకి తెచ్చుకోవడానికి ప్రయత్నం చెయ్యాలి.

శరీరానికి తేలు కుడితే ఎలా ఉంటుందో భక్తి భావం లేని మనుషులకు భగవంతుడు చెప్పిన మాటలు కూడా మనసుకి తేలు కుట్టినట్టు ఉంటాయి. అందరికీ కాదు, కొంతమంది ప్రకృతి మనుషులకి అలా ఉంటాయి. భగవంతుడు చెప్పే భావాలు మనకి లేకపోయినా, పరమేశ్వరుడు మన బాగుకోసమే చెప్పాడు అని మనం అర్థం చేసుకుని, శ్రద్ధగా శ్రవణం చేసి వాటిని మననం చేస్తే అవి మనకి అనుభవంలోకి వస్తాయి. అందుకే భగవంతుడి యందు ధ్యాస కలిగి ఆయన చెప్పిన మాటలు వింటే మనకి మారుమనస్సు వస్తుంది. అంటే మన మనస్సులో మార్పు పొందవచ్చు. శ్రవణం చేయకుండా, ధ్యానం చేయకుండా, పూజ చేయకుండా, జపం చేయకుండా, సాధన చేయకుండా మనం మారలేము. మారు మనస్సు వస్తేనే కానీ మనకి మనస్సు లోపలకి దిగదు. మన హృదయంలోనే భగవంతుడు ఉన్నాడు. నేను అనే తలంపు మనకి లోపల నుంచి వస్తుంది కానీ బయట నుంచి రావటం లేదు. దీనికి పెద్ద పెద్ద చదువులు అక్కర్లేదు, డబ్బులు అక్కర్లేదు. నేను అనే తలంపు మనకి లోపల నుంచే వస్తుంది అన్న సంగతి మనకి commonsense ఉంటే తెలుస్తుంది. అది ఎక్కడ నుంచి వస్తుంది అంటే, ఆత్మ లోంచే, చైతన్యం లోంచే, పరమేశ్వరుడు లోంచే వస్తుంది నేను అనే తలంపు. నేను అనే తలంపు వచ్చిన తరువాతే మిగతా సృష్టి, దేవుడు ఇవన్నీ వస్తున్నాయి. ఈ నేను అనే తలంపు మూలాన్ని వెతికితే అది నశిస్తుంది. నీకు అహంభావన పోవాలి, పోవాలి అంటే పోదు. అహంభావన యొక్క మూలాన్ని అన్వేషించటం నువ్వు ప్రారంభిస్తే అది నశిస్తుంది. దాని మూలాన్ని నువ్వు వెతకకపోతే, దాని మూలంలోకి దిగి దాని వేరుని కత్తిరించే శక్తి నీకు లేకపోతే అది నశించదు. అది నశించినట్టు కనిపించినా నశించదు. అందుచేత అహంభావం యొక్క మూలం నీ లోపలే ఉంది. ఆ మూలాన్ని నువ్వు ఛేదించాలి. అహంభావం యొక్క మూలాన్ని ఛేదిస్తే అహంభావం కూడా నశిస్తుంది. అది జీవిత గమ్యం. అప్పుడు నీకు వ్యక్తిభావన కూడా నశిస్తుంది. అంటే కర్తృత్వం నశిస్తుంది.

రమణమహర్షి గారు చెప్పేది ఏమిటంటే, కర్త అంటే ఎవరో నీకు తెలిస్తే కర్తృత్వం నశిస్తుంది కానీ కర్త అంటే ఎవరో నీకు తెలియనప్పుడు కర్తృత్వం కూడా నశించదు. అసలు ముందు నీకు అర్థం కావాలి కదా, మానవుడి దుఃఖానికి కారణం కర్తృత్వం. పని చెయ్యడం వలన మనకి దుఃఖం రాదు, ఇది నేను చేశాను అనే భావన వల్ల మనిషికి దుఃఖం వస్తుంది. నిజం అనేది ఒకటిగానే ఉంది, రెండు గాను, మూడు గాను లేదు. బేధం మనస్సు కల్పితం. ప్రపంచంలో ఉన్న గొడవలు అన్నీ కూడా, ప్రపంచంలో ఉన్న ఉపద్రవాలు, ఉద్రేకాలు, ప్రపంచంలో జరిగే ఈ సంఘటనలు అన్నీ కూడా మనస్సు యొక్క కల్పితం. ప్రపంచంలో ఉన్న గొడవలు అన్నీ కూడా దేని యొక్క కల్పితం? జీవుడి యొక్క కల్పితం. మనస్సు ఒకప్పుడు ఉంటుంది, మరొకప్పుడు ఉండదు. ఇప్పుడు జాగ్రదావస్థలో మనం ఉన్నాం, ఇప్పుడు మనస్సు ఉంది. గాఢనిద్రలో ఉందా? గాఢనిద్రలో మనస్సు లేదు, గాఢనిద్రలో మనస్సు లేదు, జాగ్రదావస్థలో మనస్సు ఉంది. ఒక అవస్థలో ఉండేది ఇంకొక అవస్థలో లేదు. అంటే అది నిజం కాదు. కానీ మన మనస్సుని నమ్మినట్టుగా మనం మన హృదయంలో ఉన్న నిజాన్ని మనం నమ్మటం లేదు. అన్ని అవస్థల్లో కూడా మన హృదయంలో ఒక నిజం ఉంది. జాగ్రదావస్థలో ఉంది, స్వప్నావస్థలో ఉంది, సుషుప్తి అవస్థలో కూడా ఉంది.

మన హృదయంలో పరమేశ్వరుడు సజీవంగా ఉన్నాడు. ఆయన ఉన్నాడు, లేడు అనేది అంతా కూడా మనస్సు యొక్క కల్పితం. నువ్వు ఉన్నాడు అనుకున్నప్పుడు ఆయన ఉన్నాడు, నువ్వు లేడు అనుకున్నప్పుడు కూడా భగవంతుడు ఉన్నాడు. ఆయన లేకుండా పోలేదు. ఎప్పుడూ ఉన్నాడు. నువ్వు ఉన్నాడు అనుకున్నప్పుడు కూడా ఉన్నాడు, నువ్వు లేడు అనుకున్నప్పుడు కూడా ఆయన ఉన్నాడు. ఉన్నది ఎప్పుడూ ఉంది. ఉన్నదానికి లేకపోవడం అంటూ లేదు. లేనిది ఎప్పుడూ లేదు. లేనిదానికి ఉండడం అంటూ లేదు. లేనిది ఉందని నువ్వు అనుకోవచ్చు, నువ్వు అనుకున్నప్పుడు కూడా అది లేదు. ఇది నిశ్చయం అని భగవంతుడు వాసుదేవస్వామి వారు గీతలో చెప్పారు. మనిషికి ఏ అనుమానం వచ్చినా, ఏ



**ఎదుటివాడు ప్రేమిస్తున్నాడు కాబట్టి నువ్వు ప్రేమిస్తూ ఉంటే అది సామాన్య మానవుడు చేసే పనే కదా! కాని వాళ్ళు ద్వేషించినా నువ్వు ప్రేమిస్తే, భక్తుడవు అవుతావు, భగవంతుడి అనుగ్రహానికి పాత్రుడవు అవుతావు.**

ఉపద్రవం వచ్చినా, ఏ బాధ వచ్చినా, ఏ దుఃఖం వచ్చినా, అహంకారం నుంచే వస్తుంది. అందుచేత ఈ అహంకారం ఎక్కడ నుంచి వస్తోంది అని నువ్వు వెతుకు. అహంకారం అనేది అడవి కింద ఉంది. బయటకి రా, బయటకి రా అని చెబితే సరిపోతుంది ఏమిటి? బయటకి ఎలా వస్తాం అంటున్నాడు ఈ అడిగినవాడు. అదొక అడవి పైగా అమావాస్య చీకటి. బయటకి వచ్చేయ్, బయటకి వచ్చేయ్ అంటే దారి కనబడాలి కదా బయటకి రావడానికి. మహాఅరణ్యం అది. చెట్లు ఏమైనా పల్చగా ఉన్నాయా అంటే దట్టంగా ఉన్నాయి ఆ చెట్లు. ఆ మధ్య లోంచి నేను ఎక్కడ వస్తాను? ఊరికే బయటకి రా, బయటకి రా అంటే నేను ఎక్కడ నుంచి వస్తాను అందులోంచి, చెప్పటం అందరికీ తేలికగా ఉంది. బయటకి వచ్చేయ్, అహంభావం లోంచి బయటకి వచ్చేయ్ అంటే ఎక్కడ నుంచి వస్తాం? దారి చూపించేవాళ్ళు ఉండాలి కదా, చెయ్యి పట్టుకుని తీసుకుని వెళ్ళే వాళ్ళు ఉండాలి. మనకి ఏదో ఒక రోడ్డు కనిపించాలి కదా బయటకి పోవడానికి, అసలే సంసారం గొడవలతో బాధ పడుతున్నాం అంటే, ఈ అహంభావం ఇంకా ఎక్కువ బాధ పెడుతోంది మాకు. మీ సందేహాలకి అహంభావం కారణం, మీ అనుమానాలకి అహంభావం కారణం, మీ దుఃఖానికి అహంకారం కారణం అని చెబుతున్నారు. అహంభావంలో నుండి బయటకి వచ్చేయ్ అంటున్నారు అందులో నుండి బయటకు రావటం అంత తేలికగా ఉందేంటి అంటున్నాడు ఈ పెద్ద మనిషి.

రమణాచార్యుడు ఏమంటున్నాడు అంటే నువ్వుమార్గం చూపించమంటున్నావు. అహంకారం నీకు ఎక్కడ ఉంది? లోపలే ఉంది కదా, అంతర్ముఖుడువై మార్గం వెతుకు. ఇంద్రియాల ద్వారా నీ మనస్సు ఇప్పడు బాహ్యానికి విజృంభిస్తోంది. సర్వసాధారణంగా మానవుడికి, విషయ సుఖాల తోటి, ఇంద్రియ సుఖాల తోటి కాలక్షేపం అయ్యిపోతుంది కానీ, విషయ సుఖాలు కంటే, ఇంద్రియ సుఖాలు కంటే, ఆత్మ సుఖం గొప్పది, ఆత్మ శాంతి గొప్పది అని శ్రవణం చేస్తేనే కానీ వాడికి తెలియదు. ఇంద్రియ సుఖానికి, ఆత్మ సుఖానికి ఒక తేడా ఉంది. ఇంద్రియ సుఖం స్వల్పమైనది, క్షణికమైనది, పైగా పరిణామంలో దుఃఖం తీసుకు వస్తుంది. ఆత్మ సుఖం అలా కాదు permanentగా ఉంటుంది. శరీరం ఉన్నా ఉంటుంది, ఊడిపోయినా ఉంటుంది. శాంతిగా ఉంటుంది. ఆ శాంతి అలౌకికమైన శాంతి, అనుభవంలోకి ఒక్కసారి వస్తే ఆ శాంతి లోంచి మీరు వేరు పడరు. అటువంటిది శాంతి, అది లోకానికి సంబంధించిన శాంతి కాదు, అలౌకికమైనటువంటిది. అందుచేత ఆ శాంతి ఎక్కడ ఉంది? నీ లోపలే ఉంది అయ్యా, ఆ శాంతికి సంబంధించిన రుచి నీ మనస్సుకి ఇంకా తెలియలేదు. ఇంద్రియాలకి విషయాలు ఉన్నాయి, అందుచేత దాని వైపుకే నీ మనస్సు మళ్ళుతుంది. అంటే ఇక్కడ చిన్న రహస్యం ఉంది. మనం ఈజన్మలోనే కాదు

సాధన చేస్తుంట, ఎన్నోజన్మల నుంచి ఎంతో కొంత సాధన చేస్తున్నాం. ఇవాళ మీరు జువ్వలపాలెంలో కూర్చుని శ్రవణం చేస్తున్నారు అంటే ఇవాళ వచ్చింది అనుకోకండి మీరు, జువ్వలపాలెంలో సుమారు పదివేల మంది ఉండవచ్చు. ఈ పదివేల మంది వచ్చి ఇక్కడ శ్రవణం చేస్తున్నారా? కొద్దిమందే శ్రవణం చేస్తున్నారు. అంటే శ్రవణం చెయ్యడానికి కూడా యోగ్యత ఉండాలి, అర్హత ఉండాలి, deserve అయ్యి ఉండాలి. వినాలి అనేటటువంటి కోరిక లేకపోతే మనిషి వినలేడు. మనకి అర్హత లేనప్పడు, యోగ్యత లేనప్పడు, కళ్లు ఉన్నా చూడలేము, చెవులు ఉన్నా వినలేము అన్నారు రమణస్వామి. ఎప్పడైతే మన హృదయంలో అర్హత లేదో, మనకి యోగ్యత లేదో, దేవుడు ఎదురుగా వచ్చి కూర్చున్నప్పటికీ మనకి చూడాలి అనిపించదు, వినాలి అనిపించదు.

ఇక్కడ మనం గ్రహించవలసిన విషయం ఏమిటి అంటే ఎన్నోజన్మల నుంచి మీరు ఎంతో కొంత సాధన చేస్తున్నారు. జ్ఞానం సంపాదించుకోవడం కోసం కొంత ప్రయత్నం చేశారు, మిమ్మల్ని మీరు ఉద్ధరించుకోవడానికి ప్రయత్నం చేశారు. ఆ వాసనా ఫలమే మిమ్మల్ని ఇక్కడకి తీసుకొచ్చి శ్రవణం చేయిస్తోంది. పూర్వజన్మల్లో మీరు ఏమి కృషి చెయ్యలేదు అనుకోండి మీరు ఇక్కడ కూర్చోరు అసలు, మీకు అర్థం అవుతోందా? డబ్బు ఇచ్చి కూర్చోబెట్టినా కూర్చోలేరు మీరు పూర్వజన్మల్లో సాధన చెయ్యకపోతే మనం ఎంతో కొంత పూజ చేస్తున్నాం, జపం చేస్తున్నాం, ధ్యానం చేస్తున్నాం, అంటే మనం ఏదో కృషి చేస్తున్నాం కానీ ఫలం రావడం లేదు. ఎక్కడో లోపం ఉంది, అంటే మనం సాధన చేస్తున్నాం కానీ ఉండవలసిన వైరాగ్యం మనకి లేదు. అది పెద్ద లోపం మనలో, కనిపించిన గడ్డిమేటు అల్లా మనకే కావాలి. ఎక్కడైనా పెద్ద గడ్డిమేటు కనిపించింది అనుకోండి రోడ్డు మీద వెళుతుంటే, ఇటువంటి గడ్డిమేటు ఒకటి మనకి ఉంటే బాగుంటుంది అనిపిస్తుంది. అంటే ఏమిటి మనం సాధన చేస్తున్నప్పటికీ సాధన ఫలితం మనకి రాకపోవడానికి వైరాగ్యం లేకపోవడం ఒకటే కారణం. ఉండవలసిన వైరాగ్యం మనకి లేదు. వైరాగ్యం లేని సాధన ఎలా ఉంటుంది అంటే పంచదార లేని కాఫీలా ఉంటుంది. మీరు సాధన చేస్తుంటే, ఆ సాధనకి తోడు మీకు వైరాగ్యం ఉంటే మీకు ఫలం చేతికి వస్తుంది కానీ, ఎన్నిజన్మలు ఎత్తినప్పటికీ తగినంత వైరాగ్యం లేకపోతే మటుకి ఫలితం చేతికి రాదు.

సంసార వృక్షాన్ని, ఈ అహంభావనని మీరు వైరాగ్యం అనే కత్తి తోటి నరకాలి కానీ, వైరాగ్యం అనే అస్త్రం కనుక మీ చేతిలో లేకపోతే, మీరు ఈ సంసార వృక్షాన్ని తొలగించలేరు. అంటే వైరాగ్యం లేకపోతే ఈ జనన, మరణ ప్రవాహం లోంచి, ఈ ప్రకృతి గుణాల లోంచి మీరు విడుదల అవ్వలేరు అని 15వ అధ్యాయంలో భగవంతుడు వాసుదేవస్వామి వారు

పదే పదే చెప్పారు. మీరు ఎంతో కొంత సాధన చెయ్యడం లేదు అని నేను అనటం లేదు. ఎంతో కొంత పూర్వజన్మల నుంచి మనం చేసుకుంటూ వస్తున్నాం. లేకపోతే ఈ సంస్కారం మనకి రాదు. ఈ సద్వాసన మనకి రాదు. ఎంతోకొంత సద్వాసన ఉంది కాబట్టి, సంస్కారం ఉంది కాబట్టి, మీరు శ్రద్ధగా శ్రవణం చేస్తున్నారు. కానీ తగినంత, ఉండవలసినంత వైరాగ్యం మనకి లేదు. సాధనకి తోడు వైరాగ్యం చేకూరితే మనకి ఫలం చేతికి అందుతుంది. అది ముఖ్యం. అప్పుడుమార్గం కనిపిస్తుంది. నీ మనస్సుని, రవ్వంత, ముల్లంత లోపలకి పంపించు. ఏ విషయాలు అయితే నీ మనస్సుని బయటకి ఆకర్షిస్తున్నాయో, వాటి లోంచి నీ మనస్సుని disconnect చెయ్యి. ఒకే విషయం అందరి మనుషులని ఆకర్షించదు. ఒకొక్క విషయం ఒకొక్క మనిషిని ఆకర్షిస్తూ ఉంటుంది. మీ మనసు ఏ విషయం చేత ఆకర్షించబడుతుందో చూసుకోండి. ఏ ఇంద్రియం ద్వారా బయటకు వెళుతుందో చూసుకోండి, అక్కడ నుంచి జాగ్రత్తగా ఉపసంహరించండి. దానిని ఉపసంహరిస్తే అది అంతర్ముఖం అవుతుంది. అప్పుడు మీ లోపల ఉన్నటువంటి సద్వస్తువు దగ్గరకి వెళ్ళటానికి మీకుమార్గం కనబడుతుంది. అయితే మీ మనస్సు యొక్క ముఖం అటు తిప్పాలి. లోపలే ఉంది నీకు రోడ్డు. మార్గం వెతుకు. లోపల అది నీకు కనిపిస్తుంది. బయట వెతికితే లాభం లేదు. నువ్వు ఎవరో నీకు తెలియడానికి ప్రపంచంలో వెతికితే నీకు దొరకదు. ఎన్ని లక్షలాది జన్మలు ఎత్తినా, ఎన్ని వేలాదిజన్మలు ఎత్తినా, వస్తువు ఎక్కడ లేదో అక్కడ వెతికినా నీకు ప్రయోజనం లేదు. నీకు మిగిలేవి కన్నీళ్ళు, నీకు మిగిలేవి చెమట బిందువులు.

ఇక్కడ భగవాన్ ఏమని చెబుతున్నారు అంటే మీరు ఎవరో మీకు తెలియాలి అంటే మీరు లోపల వెతికితే మీకు తెలుస్తుంది. కానీ బయట వెతికితే ఎన్ని వేలజన్మలు వెతికినా, మీకు కన్నీళ్లు మిగులుతాయి, కష్టాలు మిగులుతాయి. వస్తువు బయట లేదు కాబట్టి, వస్తువు ఎక్కడ లేదో అక్కడ వెతికినా మీకు ప్రయోజనం లేదు. వస్తువు ఎక్కడ ఉందో అక్కడ వెతకండి ఈజన్మలో కాకపోయినా, రాబోయేజన్మలో అయినా, ఈనాటికి కాకపోయినా, ముందు నాటికి అయినా అది మీకు దొరుకుతుంది. వస్తువు ఎక్కడ పోయిందో అక్కడ వెతకండి ఏదో ఒక రోజున దొరుకుతుంది. అదే విధంగా వస్తువు ఒక చోట పోగొట్టుకుని, మరొక చోట మీరు వెతకకండి. మరొక చోట వెతికితే కోట్లాదిజన్మలు ఎత్తిమీరు వెతికినా అది దొరకదు. మీరు లోపలే ఉన్నారు, మీరు బయట లేరు. ఈ దేహబుద్ధి ఉన్నంతకాలం లోపల, బయట అనే గొడవ మనకి ఉంటుంది. ఎప్పుడైతే దేహబుద్ధి నశించిందో వాడికి లోపల లేదు, బయట లేదు, కింద లేదు, పైన లేదు. ఉన్న వస్తువు అంతటా ఉంటుందన్న సంగతి వాడికి తెలుస్తుంది. అందుచేత అనుభవం అనేది నీ హృదయంలో పొందాలి. నీకు ఆత్మానుభవం కలిగిన తరువాత బ్రహ్మం అంటే ఏమిటో, దేవుడు అంటే ఏమిటో నీకు

తెలుస్తుంది.

ఇప్పుడు మన ఆధ్యాత్మిక స్థాయి చూస్తే ఒకటవ తరగతిలో ఉన్నాం. గుళ్ళోనే దేవుడు ఉన్నాడు అనుకుంటాం. కాని ప్రపంచం అంతా దేవుడు వ్యాపించి ఉన్నాడు. నేను లేని చోటు లేదు అని గీతలో పరమాత్మ చెప్పాడు. అంటే గుళ్ళో మాత్రమే దేవుడిని చూసేవాడు ఒకటవ తరగతి వాడి తోటి సమానం. అంతటా వ్యాపించి ఉన్న దేవుడిని, సృష్టి అంతా, పంచ భూతాలలోని మొత్తం అన్ని చోట్లా వ్యాపించి ఉన్న దేవుడిని చూసేవాడు M.A., చదివినట్టు. ఆధ్యాత్మికంగా M.A., చదివినవాడు ఏమి చేస్తాడు అంటే దేవుడిని అంతటా చూస్తాడు. ఆయన అంతటా ఉన్నాడు కాబట్టి, కానీ ఒకటవ తరగతి చదివిన వాడికి గుళ్ళోనే దేవుడు కనిపిస్తాడు కానీ అంతటా ఉన్న దేవుడు ఒకటవ తరగతి చదివిన వాడికి కనపడడు. అంతటా ఉన్న దేవుడిని చూసే శక్తి మనకి లేదు కాబట్టి, మనవాళ్ళు ఏదో దేవాలయాన్ని కట్టించి అక్కడ దేవుడి యొక్క విగ్రహాన్ని ప్రతిష్టిస్తున్నారు. కానీ దేవుడు అక్కడే పరిమితం అయ్యి లేడు. దేవుడు అంతటా ఉన్నాడు. ఆచార్య స్వాముల వారు కాశీ వెళ్ళి, విశ్వేశ్వరుని దర్శనం చేసుకుని, ప్రార్థించారు. ఆయనేమి వరాలు అడగలేదు. ఏమని చెప్పాడు అంటే నేను ఒక పొరపాటు చేశాను, ఆ పొరపాటుకి క్షమించమని ఆచార్యస్వాములవారు విశ్వేశ్వరుడిని ప్రార్థించారు. దేవుడు అంతటా ఉన్నాడు. దేవుడు లేని చోటు అంటూ లేదు. కానీ కాశీలో, ఈ గుళ్ళో ఉన్నావు అనుకుని నీ దగ్గరకు వచ్చాను. అంతటా ఉన్న నిన్ను గుడికి పరిమితం చేసి ఇక్కడే ఉన్నావు అనుకుని వచ్చాను. నేను చేసిన ఈ పొరపాటుకి నన్ను క్షమించి ఆశీర్వదించు అన్నారు.

నీ మూలం ఎక్కడ ఉంది? నీ మూలం నీ లోపలే ఉంది. అక్కడ వెతికితే నీకు ప్రయోజనం ఉంటుంది. ఈజన్మలో కాకపోయినా రాబోయేజన్మలో అయినా నీకు దొరుకుతుంది. బయట వెతికినా నీకు దొరకదు. ఎంత నువ్వు ప్రయాస పడ్డా నీకు దొరకదు. వెతికినా నాకు దొరకడం లేదు అంటున్నాడు. అంటే మనస్సు వీడికి అంతర్ముఖం కాక వెతికినా నాకు దొరకడం లేదు అంటున్నాడు. దొరకకపోతే పోనీ నువ్వు ఎక్కడ ఉన్నావో చూడు. నువ్వు లేనని అనగలవా? దేవుడు లేడని మానవుడు చెప్పగలడు కానీ నేను లేనని చెప్పలేడు. ఇది బాగా అర్థం చేసుకోండి. దేవుడు లేడని మానవుడు చెబుతాడు. దేవుడు లేడని చెప్పడానికి కూడా నేను ఉండాలి. నేను ఉంటే దేవుడు లేడని చెప్పాలి. వీడు ఎవడో వీడికి తెలియకుండా దేవుడు తెలియబడడు. మీకు అర్థం అవుతోందా? నేను ఎవరినో నాకు తెలియకుండా దేవుడు తెలియబడడు. ఒకవేళ మానవుడు వాడు ఎవడో వాడు తెలుసుకోకుండా, నేను దేవుడిని చూశాను అంటే అది నిజం కాదు, అది కేవలం మానసిక దృశ్యం మాత్రమే అన్నారు భగవాన్. నువ్వు అనేవాడివి ఒకడివి ఉన్నావు, నిన్ను

నువ్వు విచారణ చేసుకో, ఏది నీకు నేనుగా వ్యక్తం అవుతుంది? మన లోపల ఉన్న మనస్సే మనకు నేనుగా వ్యక్తం అవుతుంది. అంటే పూర్వజన్మ సంస్కారాన్ని బట్టి వాడు వెతుకుతాడు. వెతకటం అనేది జ్ఞానమార్గం, విచారణ అనేది జ్ఞానమార్గం. ఒకవేళ అది మీకు అలవాటు లేకపోతే, నీ ఇష్ట దేవత మీద నీ మనస్సుని నిలబెట్టి ఉంచు. అంటే ఏక వస్తువుని చింతించడం వల్ల కూడా అహంభావన నశిస్తుంది. అహంభావన యొక్క మూలాన్ని వెతికినా అహంభావం నశిస్తుంది అది వెతకటం. ఒకవేళ అది నీకు చేతకాక పోతే ఏక వస్తువుని చింతించడం వల్ల, నీకు అవతార పురుషులలో రాముడు కానీ, కృష్ణుడు కానీ, శంకరుడు కానీ, ఎవరు ఇష్టమైతే వారు, వారి యొక్క రూపాన్ని నిరంతరం ధ్యానం చేయడం వల్ల, వారి నామాన్ని నిరంతరం స్మరించడం వల్ల మనస్సు నశిస్తుంది. అంటే ఏక వస్తువుని చింతించడం వల్ల, మీకు ఏ దేవుడు అయితే ఇష్టమో ఆ దేవుడిని నిరంతరం చింతించడం వల్ల మనస్సు నశిస్తుంది.

ఓ సర్వేశ్వరుడా, ఓ ప్రభువా, నా హృదయంలో ఆనందం ఉంది, నా హృదయంలో శాంతి ఉంది, నా హృదయంలో చైతన్యం ఉంది. చావులేని స్థితి నా హృదయంలోనే ఉంది. నా హృదయంలో ఉన్న సుఖం నాకు అందకుండా, నా హృదయంలో ఉన్న ఆనందం నాకు అందకుండా, నా అహంభావనే పైన మూతగా ఉంది. ఆ మూతని నేను తీసుకోవడానికి జన్మజన్మల నుంచి ప్రయత్నం చేస్తున్నాను. ఈ అహంభావన అనే మూత బయటకి తీసుకోవడానికి నీ సహకారం నాకు ఇవ్వాలి. నీ సహకారం లేకుండా ఈ పని నేను పూర్తి చెయ్యలేను అన్నాడు ఒకమహర్షి. అంటే ఆ మాట మనకోసం చెప్పాడు. అందుచేత ఉన్న వస్తువుని నీకు వెతకటం చేతకాక పోతే భక్తిమార్గం, జ్ఞానమార్గం, కర్మమార్గం ఏదో ఒకమార్గం ద్వారా మనం భగవంతుడిలో ఐక్యం కావచ్చు. ఏమార్గంలో అయితే పూర్వజన్మలో మనం సాధన చేశామో, ఆ మార్గానికి ఈజన్మలో మనం ఆకర్షింప బడతాము. కొంతమందికి జ్ఞానమార్గం అంటే ఇష్టం. కొంతమందికి భక్తిమార్గం అంటే ఇష్టం. కొంతమందికి ధ్యానమార్గం అంటే ఇష్టం. కొంతమందికి కర్మమార్గం అంటే ఇష్టం. మీకు నచ్చిన మార్గంలోనే మీరు తరించండి. మీరు భగవంతుడిలో ఐక్యం అవ్వడానికి ఒక్కమార్గం సరిపోతుంది. ధ్యానం ఇష్టం అయితే ధ్యానం చెయ్యండి. విచారణ ఇష్టమైతే విచారణ చెయ్యండి. అయితే విచారణమార్గం ప్రత్యక్షమార్గం అన్నారు భగవాన్. ధ్యానమార్గం చెయ్యాలి అంటే నీ మనసును ఒక వస్తువు మీద నిలబెట్టి అక్కడ ధ్యానం చేయాలి. దానివల్ల కూడా నువ్వు భగవంతుడిని తెలుసుకోవచ్చు. అది పరోక్షమార్గం. మీకు నచ్చిన మార్గంలో మీరు తరించండి.

మీకు అన్వేషించటం చేతకాకపోతే మీకు అలవాటు లేకపోతే, మీ గురువు మీద

కానీ, ఈశ్వరుడు మీద కానీ, ఏ రూపం మీద నీకు ప్రీతి ఉంటే ఆ రూపం మీద నీ మనస్సుని పెట్టి ధ్యానం చెయ్యి, నీ మనస్సుని అక్కడ నిలబెట్టు. నీ మనస్సుని ఆ వస్తువు మీద చింతింపచెయ్యి. అప్పుడు మనస్సు నశిస్తుంది అని భగవాన్ చెబుతున్నారు. భగవాన్‌కు ఎవరిని బలవంతం చేసే అలవాటు లేదు. వాడికి చెప్పటం చెబుతారు అంతేకానీ నువ్వు ఇలా చెయ్యి, అలా చెయ్యి అని బలవంతం చేసే అలవాటు ఆయనకి లేదు. తరువాత మీరు తీసుకుంటే తీసుకున్నట్టు లేకపోతే లేనట్టు. అంతేకానీ బలవంతం చేసి చెప్పే అలవాటు ఆయనకి లేదు. ఆలోచన ప్రధానం, సబ్జెక్టు ప్రధానం కానీ ఎదుట మనిషిని ఉద్రేక పరచడానికి ఆయన ఇష్టపడరు. ఏదైనా ఒక విషయం తెలుసుకోవాలి అనే కాంక్ష తోటి మీరు అడిగితే చెప్పేవారు కానీ అహంభావం తోటి అడిగితే మటుకు ఊరక ఉండేవారు, మౌనంగా ఉండేవారు. సమాధానం కూడా చెప్పేవారు కాదు. సద్గురువు అంటే కేవలం పుస్తక జ్ఞానం ఉంటే సరిపోదు. వాడికి పుస్తక జ్ఞానం ఉండాలి, ఆ పుస్తకంలో ఉన్నది వీడికి అనుభవంలో ఉండాలి. వీడికి అనుభవంలో ఉన్న విషయాన్ని ఇతరులకి అర్థం అయ్యేలా చెప్పగలగాలి. అంటే బోధించే శక్తి ఉండాలి. బోధించి, బోధించి, తన అనుభవాన్ని వాడికి ప్రసాదించే శక్తి కలిగి ఉండాలి. అనుగ్రహం ఉండాలి. వాడు సద్గురువు. అనుగ్రహానికి, వరానికి తేడా ఉంది. దేవుడిని, ప్రార్థించగా, ప్రార్థించగా మనం అడిగింది ఆయన ఇవ్వవచ్చు. దానిని వరం అంటారు కానీ అనుగ్రహం ఎటువంటిది అంటే మనం ఏమీ అడగము, అప్పుడు ఏమి చేస్తాడు అంటే మనకి ఏది మంచిదో అది ఆయన ఇస్తాడు అది అనుగ్రహం. నాకు ఏది మంచిదో అది నువ్వు చెయ్యి అని పరమేశ్వరుడు మీద తన భారం పూర్తిగా శేషం లేకుండా వేసిన వాడికే అనుగ్రహం కలుగుతుంది. అంటే వీడు ఏమి అడగడు. అడగకపోతే వాడు ఇవ్వడేమో అని భయం అక్కర్లేదు. అంటే మన భారాలన్నీ పరమేశ్వరుడు మీద వేస్తే మనకి ఎప్పుడు అవసరమో, ఎక్కడ అవసరమో, ఏది అవసరమో అది ఇస్తాడు దానిని అనుగ్రహం అంటారు. మీకు అర్థం అవుతోందా? వరం వేరు, అనుగ్రహం వేరు. మనం అడగకుండా వచ్చేది అనుగ్రహం. అడిగి తెచ్చుకునేది వరం.

**మీరు ఎంత డబ్బు సంపాదించినా అది మీ కూడా రాదు. పైగా మీ కుటుంబంలో కలహాలకు ఆ డబ్బే కారణం అవుతుంది. మీరు ఒక మంచిగుణం సంపాదించుకుంటే రాబోయే జన్మలలో అది మీ కూడా వస్తుంది. మీకు జ్ఞానం కలగటానికి ఆ మంచిగుణం మీకు సహకరిస్తుంది.**



నీకు ఏ దేవుడు అయితే ఇష్టమో ఆ దేవుడు మీద నీ మనస్సుని నిలబెట్టుకుని ధ్యానం చెయ్యి, ఏక వస్తువుని చింతించడం వలన మనస్సు నశిస్తుంది అని చెపితే ధ్యానం చెయ్యమంటున్నారు రైటే, మనస్సు నిలబడాలి కదా అని అడుగుతున్నాడు. ఇందులో ఇంకొక విషయం ఉంది. ధ్యానం చెయ్యడానికి ముందు ప్రేమ ఉండాలి, ప్రీతి ఉండాలి. ఏ వస్తువు మీద అయితే మనం ధ్యానం చెయ్యాలి అనుకుంటున్నామో, మనం కృష్ణుడు యొక్క రూపం మీద ధ్యానం చెయ్యాలి అనుకుంటున్నాం అనుకోండి, ఆ కృష్ణుడి యొక్క రూపం మీద మనకి ప్రీతి ఉండాలి. కృష్ణుడు యొక్క నామం మీద మనకి ఇష్టం ఉండాలి. ఆ కృష్ణుడు చేసిన మహిమలు, కృష్ణుడు చెప్పిన మాటలు విని ఉండాలి. కొంతమంది అంటూ ఉంటారు. చూసి అయినా ఉండాలి, విని అయినా ఉండాలి. వీడు చూశాడా, విన్నాడా అంటారు. మీకు అర్థం అవుతోందా? ఏదైనా మనం కళ్లతోటి చూసి అయినా ఉండాలి, చెవుల తోటి విని అయినా ఉండాలి, చూడని వాడికి, వినని వాడికి ఏమీ తెలియదు. ఊరికే మొట్ట మొదటే ధ్యానం మొదలు పెట్టేస్తే ఎలా తెలుస్తుంది వీడికి? కృష్ణుడు యొక్క ఔన్నత్యం, ఆ చైతన్య స్థాయి, అంటే కృష్ణుడిలో ఉన్నటువంటి ఆ అవతార పురుషుడి యొక్క లక్షణాలు, ఇవన్నీ శ్రవణం చెయ్యాలి, ఆ కృష్ణుడి మీద ప్రేమ కలగాలి, ఆ కృష్ణుడు మీద ప్రీతి కలగాలి, ఆ కృష్ణుడు మీద ఇష్టం కలగాలి. అప్పుడు కానీ వీడికి ధ్యానం కుదరదు. అవి ఏమీ లేకుండా ఊరికే నీకు ధ్యానం ఎలా కుదురుతుంది అంటున్నారు. మీకు అర్థం అవుతోందా? అసలు ఏ దేవుడి మీద అయితే మనం ధ్యానం చేద్దాం అనుకుంటున్నామో, ఆ దేవుడికి సంబంధించిన విషయం మనకి తెలిసి ఉండాలి. మీకు అర్థం అవుతోందా? వాడి గొప్పతనం తెలిసి ఉండాలి. వాడి జ్ఞానం యొక్క స్థాయి మనకి తెలిసి ఉండాలి.

మనం భగవంతుడిని ప్రార్థించగా, ప్రార్థించగా, భగవదనుగ్రహం కలగడం కోసం ఏమనస్సు అయితే అడ్డు వస్తుందో, ఆ మనస్సుని వాడే కరగబెట్టేస్తాడు. అది ధ్యానం చెయ్యడం వలన కలుగుతుంది. అంటే ఇష్టం లేని చోట కష్టంగా ఉంటుంది. ఇష్టం ఉన్నచోట కష్టం ఉండదు. దేవుడి గురించి మనం ధ్యానం చెయ్యాలి అంటే, ఏ దేవుడి గురించి మనం ధ్యానం చేస్తున్నామో, ఆ దేవుడి మీద మనకి ఇష్టం ఉండాలి. ఇష్టం లేకపోతే ధ్యానం చెయ్యలేము. ధ్యాస లేకుండా ధ్యానం చెయ్యలేము. పరమేశ్వరుడు యొక్క గాథలు వినండి. పరమేశ్వరుడు చెప్పిన మాటలు వినండి. శ్రవణం చెయ్యగా, చెయ్యగా ఆ మాటల మీద, ఆ పనుల మీద మీకు ధ్యాస కలుగుతుంది. మీ ధ్యాస మీ ధ్యానానికి దారి తీస్తుంది. ధ్యానం చెయ్యగా, చెయ్యగా చేసే మనస్సు నశిస్తుంది. నశించిన వెంటనే ఆ మనస్సు ఇప్పుడు నీకు ఏ విధంగా అయితే నేనుగా వ్యక్తం అవుతుందో, నీ హృదయంలో ఉన్న దేవుడే అప్పుడు నీకు నేనుగా వ్యక్తమవుతాడు. అది నీ కడసారిజన్మ, అది చివరిజన్మ. అప్పుడు ఈ

జనన, మరణ ప్రవాహం లోంచి బయటపడి నువ్వు ఒడ్డుకి వచ్చేస్తావు. అప్పుడు నా స్వరూపం నీకు తెలుస్తుంది అంటున్నాడు పరమేశ్వరుడు.

నేను ధ్యానం చేస్తున్నాను, నాకు కుదరటం లేదు అంటున్నాడు. అసలు వీడికి ఇష్టం ఉంటే కదా? ధ్యానం కుదరటం లేదు అంటే భగవాన్ ఏమన్నారు అంటే భగవంతుడి మీద నీ మనసును నిలబెట్టినప్పుడు పోనీ చలించి వెళ్లిపోతోంది అనుకో, దానిని వెనక్కి తోలుకుని రా అంటున్నారు. మీకు అర్థం అవుతోందా? దూడలని తోలుకుని వెళ్లే వాళ్లని మీరు ఎప్పుడైనా చూడండి, దూడలని అలా తోలుకు వెళుతూ ఉంటాడు. ఒకో దూడ ఏమి చేస్తుంది? పక్కకి వెళ్ళిపోతుంది. ఆ తప్పి పోయిన దూడని మళ్ళీ రోడ్డు ఎక్కిస్తూ ఉంటాడు. అలాగ మన పతి ఎవడు? భగవంతుడు, మనం అందరం పశువులం. అహంభావం ఉన్నవాడు, దేహబుద్ధి ఉన్నవాడు ప్రతీవాడు పశువే. అయితే ఆ పశువుకి నాలుగు కాళ్ళు ఉన్నాయి, మనకి రెండే కాళ్ళు ఉన్నాయి. అందుచేత మనల్ని ద్విపాద పశు వులు అంటారు. దేవుడు ఎవడు? పశుపతి. పశువులు అంటే జీవులు. దూడలు కాచుకునేవాడు తప్పిపోయిన దూడని మళ్ళీ రోడ్డు ఎలా ఎక్కిస్తాడో, నువ్వు నీ మనస్సుని ఏమి చెయ్యాలి అంటే అది పక్కకి వెళ్ళిపోతోంది అంటున్నావు కదా. పక్కకి వెళ్ళిపోతే కంగారు పడకు నీ మనస్సుని వెనక్కి తీసుకొచ్చి నీ ఇష్ట దేవత మీద నీ మనస్సుని నిలబెట్టడానికి ప్రయత్నం చెయ్యి అన్నారు.

ముందు రోగ నిర్ధారణ చేయకుండా మందు గురించి ఆలోచించకూడదు. ముందు రోగ నిర్ధారణ అయ్యిన తరువాత ఆ రోగ నివారణకి మందు ఇస్తారు. డయాగ్నోసిస్ కరెక్ట్ గా ఉండాలి. మీకు అర్థం అవుతోందా? ముందు మీరు ఏమి చేస్తారు అంటే మన మనస్సు ఏ ఇంద్రియం ద్వారా, ఏ విషయం మీదకి ఆకర్షించ బడుతుందో, అది చూసుకుని జాగ్రత్తగా మనసుని ఆ విషయం నుంచి ఉపసంహరించటం నేర్చుకోవాలి. మనం ఆలోచించుకుని మాట్లాడాలి. మనం ఆలోచించుకోకుండా మాట్లాడితే మళ్ళీ ఎదుట వాళ్లకి క్షమాపణ చెప్పకోవాలి. తోటి మానవుడి యొక్క హితవు కోరి, వాడి క్షేమం కోరి, మాట్లాడే మాట కూడా మృదువుగా మాట్లాడితే మన అహంభావన తగ్గుతుంది. మనం మృదువుగా మాట్లాడకపోతే మన అహంభావం పెరుగుతుంది. అందుచేత మన మాటల్లో కూడా మనం జాగ్రత్తగా ఉండాలి. నాలుగు సార్లు ఆలోచించి ఒక మాట మాట్లాడాలి. మనం ఆలోచన లేకుండా మాట్లాడితే మన మాటలే మనకి కష్టాలు తీసుకు వస్తాయి. మన మాటలే మనకి దుఃఖాలు తీసుకు వస్తాయి. మన మాటలే మనల్ని బంధిస్తాయి.

మనలను బంధించేది ఎవరు? మనస్సే బంధిస్తుంది. కోరికలు ఎక్కడ ఉన్నాయి?

మనస్సులోనే ఉన్నాయి. ఆత్మలో కోరికలు లేవు. శవానికి ఎక్కడైనా కోరికలు ఉంటాయా? ఏ శవం అయినా వెళ్లి సినిమా చూద్దాం అనుకుంటుందా? శవానికి కోరికలు లేవు, చైతన్యానికి కోరికలు లేవు, చైతన్యానికి తనకంటే వేరుగా ఏది లేదు. నీకు వేరుగా ఏదైనా వస్తువు కనిపిస్తున్నప్పుడు దానిమీద నీకు ఆకర్షణ కలుగుతుంది కానీ, నీకు వేరుగా ఏది లేదు అనే అనుభవం నీకు వచ్చినప్పుడు, కోరిక ఉదయించదు. అందుచేత మీకు కోరికలు ఎక్కడ ఉన్నాయి? మనసులో ఉన్నాయి. మనస్సు నశిస్తే కోరికలు నశిస్తాయి. అందుచేత నీ మనస్సుని ఏ విషయం అయితే ఆకర్షిస్తుందో ముందు నువ్వు అది చూసుకో, ఆ విషయం నుండి మనస్సుని ఉపసంహరించు. ఉపసంహరించి నీ ఇష్ట దేవత మీద నీ మనస్సుని నిలబెట్టే అలవాటు నువ్వు చేసుకో, క్రమేణ ధ్యానం చేసే స్థితి నీకు కుదురుతుంది. అప్పుడు నువ్వు బాగు పడతావు. ఎప్పుడైతే మనస్సుకి ఏకాగ్రత కుదిరిందో, మనస్సుకి ధ్యానం ఎప్పుడైతే కుదిరిందో, మనస్సు ఎప్పుడైతే పల్చబడిందో, మనస్సు ఎప్పుడైతే శుద్ధమైందో, నీకు తెలియ కుండానే లోపలకి ప్రవేశిస్తుంది. దేవుడు ఎక్కడ ఉన్నాడో అక్కడికే అది ఆకర్షించబడుతూ ఉంటుంది. స్థూల మనస్సుని ఏ విధంగా అయితే నీ ఇంద్రియాలు ఆకర్షిస్తున్నాయో, ఇంద్రియ సుఖాలు ఆకర్షిస్తున్నాయో, అలాగే నీ మనస్సు బాగు పడినప్పుడు నువ్వు కొంచెం ధ్యానం చేసినప్పుడు, పరమేశ్వరుడు పట్ల నీకు ప్రీతి కలిగినప్పుడు పరమేశ్వరుడు ఏ స్థానంలో ఉన్నాడో ఆ స్థానం వైపు నీ మనస్సు ఆకర్షించబడుతుంది. నువ్వు సాధన చేస్తే నీకు కొంత కాలానికి అది ఆకర్షించబడుతుంది.

మీరు బాగానే చెబుతున్నారు కానీ ఎప్పుడు ఏదో ఒక రకమైన దుఃఖం వస్తోంది, ఒక దుఃఖం పోయేటప్పటికి ఇంకొక దుఃఖం వస్తుంది. ఒక బాధ పోయింది అనేటప్పటికి ఇంకొక బాధ వస్తుంది. ఆ మనవల గొడవ వదిలిపోతే ఈ మనవల గొడవ వస్తుంది. ఆ కోడలి గొడవ వదిలి పోయింది అంటే ఇంకో కోడలి గొడవ వస్తుంది. ఏదోఒక రకమైన సంసారం గొడవ, ప్రకృతి గొడవ వెంటాడుతోంది. ఏదో ఒక కారణంగా దుఃఖం మమ్మల్ని వెంటాడుతోంది. విచారణ చెయ్యాలి అన్నా, ధ్యానం చెయ్యాలి అన్నా, మనస్సు ఎప్పుడు దుఃఖంలో ఉంటే మేము ఏమి చేస్తాము అంటున్నారు. అసలు మనసుకు కుదురుండాలి కదా, మనసుకి శాంతి ఉండాలి కదా, మా మనసుకి కుదురు లేదు, శాంతి లేదు, ఒక గొడవ వదిలిపోయింది అంటే ఇంకొక కొత్త గొడవ వస్తోంది. ఒక దుఃఖం పోయింది అనేటప్పటికి ఇంకొక దుఃఖం వస్తుంది. ఒక బాధ తప్పకునేటప్పటికి ఇంకొక బాధ వస్తుంది. ఏదో ఒకటి ఇలా వెంటాడుతున్నాయి, ఏదో ఒక చిక్కులు వెంటాడుతున్నాయి. ఏదో ఉపద్రవాలు వస్తూ ఉన్నాయి. ఇవన్నీ తప్పకుంటే కదా సాధన చెయ్యడానికి అంటున్నారు. అప్పుడు భగవాన్ ఏమంటున్నారు అంటే నీ మనస్సు బలహీనంగా ఉంది, నీ మనస్సు ఏ

విషయాన్ని తట్టుకోలేకపోతోంది. అంటే నీ మనసుకి ఇప్పుడు తట్టుకునే శక్తి కావాలి. ఇప్పుడు ఎన్ని మాటలు నీకు చెప్పినా నీ మనసు బలహీనపడిపోయింది. నీ మనస్సుకి ముందు strength కావాలి. దాని గురించి నువ్వు ఏమి చేస్తావు అంటే భావనా బలం నువ్వు అలవాటు చేసుకో, మనస్సుని దృఢం చెయ్యి, మనస్సుని ఏకాగ్రం చేసుకో, నీ మనస్సు ఇప్పుడు దుర్బలంగా ఉంది. దానికి మంచి గుణాలని, కళ్యాణ గుణాలని, ఆత్మ గుణాలని మనస్సుకి అలవాటు చెయ్యి. నెమ్మది, నెమ్మదిగా, స్లోగా, స్టడీగా, శాంతంగా, స్థిరంగా, ఏకాగ్రంగా, నిదానంగా, నీ మనస్సుకి బలం చేకూర్చు. కంగారు పడకు. నీ మనస్సుకి బలం చేకూరిస్తే అప్పుడు ఏమి వచ్చినా తట్టుకునే శక్తి నీకు వస్తుంది. జాగ్రత్తగా చెయ్యి అంటున్నారు.

ఏవండీ నా మనస్సుకి బలం చేకూర్చుకోమంటున్నారు. శరీరానికి బలం చేకూర్చుకోమంటే A విటమిన్, B విటమిన్, అన్ని విటమిన్ లు ఉన్న ఆహారం తినేస్తాం. మాకేమి తిండికి లోటు లేదు. చేతి నిండా డబ్బు ఉంది. అందుచేత మీరు ఏమైనా టానిక్‌లు ఇస్తే పుచ్చుకుంటాం. శరీరానికి బలం చేకూర్చాలి అంటే శుభ్రంగా పోనీ తింటాం. కాని మీరు మనస్సుకి బలం చేకూర్చుకోమంటున్నారు. తినటం వల్ల మనస్సుకి బలం రాదు కదా, తినటం వల్ల శరీరానికి బలం పెరుగుతుంది. మనస్సుకి బలం చేకూర్చుకో, మనస్సుకి బలం చేకూర్చుకో అంటున్నారు ఏమిటి, అది ఎలా చేకూర్చుకోవాలి? అని ఈ భక్తుడు అడుగుతున్నాడు. అప్పుడు భగవాన్ ఏమి చెబుతున్నారు అంటే నీ మనస్సుకి బలం ఎలా వస్తుందో చెప్పమంటావా? సత్పురుషుల తోటి సహవాసం చెయ్యి. మహాత్ములని విడిచి పెట్టకు, సత్పురుషుల తోటి సహవాసం చెయ్యి, సహృదయుల తోటి సహవాసం చెయ్యి, మీకు అర్థం అవుతోందా? ఎవరైనా దుర్మార్గులు ఉన్నారు అనుకో, వాళ్ళని ద్వేషించకు, వాళ్ళ తోటి నువ్వు విరోధం పెట్టుకోకు. వాళ్ళ పట్ల ఉదాసీనంగా ఉండు. వాళ్ళ గొడవలలో నువ్వు ఏమి కలుగజేసుకోకు. అలా నువ్వు సత్పురుషుల తోటి సహవాసం చెయ్యి. ఈశ్వరుడిని ఆరాధించు, ఈశ్వరుడి యొక్క పాదాలను విడిచి పెట్టకు. సద్గ్రంథాలు చదవటం వల్ల అంటే వేదం కానీ, ఉపనిషత్తు కానీ, జ్ఞాని చెప్పిన మాటలు కానీ, మహర్షులు చెప్పిన మాటలు కానీ, చదవటం వల్ల, అవి పారాయణం చెయ్యటం వల్ల, సత్పురుషుల సహవాసం చెయ్యటం వల్ల, ప్రాణాయామం చెయ్యటం వల్ల, ఈశ్వరుడిని ఆరాధించటం వల్ల, నీ జపం వల్ల, నీ ధ్యానం వల్ల ఒకటి కాదు ఇవన్నీ కలిపి నువ్వు చేసుకుంటే, నీ మనస్సుకి దృఢత్వం వస్తుంది, నీ మనస్సుకి ఏకాగ్రత వస్తుంది, నీ మనస్సుకి కుదురువస్తుంది, నీ మనస్సు శాంతంగా ఉంటుంది, నీ మనస్సు నిదానంగా ఉంటుంది. ఏకాగ్రం అయిన మనస్సు, అంతర్ముఖం అయిన మనస్సు ఏ వస్తువు అయితే నీ హృదయంలో ఉందో ఆ వస్తువుని అందుకుంటుంది. దృఢంగా ఉన్న మనస్సు, శాంతంగా ఉన్న మనస్సు, ఏకాగ్రంగా ఉన్న మనస్సు, పలుచబడిన

మనస్సు, సూక్ష్మాతి సూక్ష్మం అయిన మనస్సు దేవుడిని అందుకుంటుంది. నేను చెప్పిన పనులు అన్నీ చేస్తే నీ మనస్సులో దృఢత్వం వస్తుంది. మానసికమైన ఆరోగ్యం వస్తుంది. నీ మానసిక ఆరోగ్యం కూడా నీ శరీర ఆరోగ్యానికి ఉపయోగపడుతుంది. అందుచేత నువ్వు ఈశ్వరుడిని ఆరాధించు. సత్పురుషుల తోటి సహవాసం చెయ్యి.

వ్యర్థమైన పనుల తోటి, వ్యర్థమైన మాటల తోటి, వ్యర్థమైన చింతల తోటి, వ్యర్థమైన గొడవల తోటి, వ్యర్థమైన ఆలోచనల తోటి, నీ ప్రాణశక్తిని వృథా పరుచుకోకు. నీ ప్రాణశక్తిని సద్వినియోగం చేసుకో, ఎప్పుడైతే నీ ప్రాణశక్తిని సద్వినియోగం చేసుకున్నావో, అప్పుడు ఆధ్యాత్మికంగా కూడా నీకు పురోగమనం వస్తుంది. ప్రాణ శక్తే పరిణామంలో ఆధ్యాత్మిక శక్తిగా పరిణమిస్తుంది. అందుచేత ప్రాణశక్తిని వృథా చేసుకోకు. అక్కర్లేని మాటలు మాట్లాడకు. నీకు కానీ, సమాజానికి కానీ ఉపయోగం లేని పనులు చెయ్యకు. దానివల్ల ప్రాణశక్తి waste అయ్యిపోతుంది. ఈ ప్రాణశక్తి వేస్ట్ అయిపోతే నువ్వు ఏమి సాధించలేవు అని భగవంతుడు పదే పదే చెప్పాడు. భగవంతుడు చెప్పినట్టు అన్నీ చేస్తాను. సత్పురుషుల సహవాసం చేస్తాను. అవతారపురుషుడిని ధ్యానం చేస్తాను. పెద్దలని సేవిస్తాను. వారియొక్క అనుగ్రహానికి పాత్రుడిని అవుతాను. అప్పుడు నా మనస్సుకి శాంతి కుదురుతుంది అనుకోండి. మీరు చెప్పినవి అన్నీ చేసేస్తాను తరువాత ఏమి వస్తుంది అంటున్నాడు. చెయ్యటం ఇంకా మొదలు పెట్టలేదు వీడు. కానీ తరువాత ఏమి వస్తుంది అంటున్నాడు. అప్పుడు భగవాన్ పాపం వాడి సందేహ నివారణకు వాడి కూడానే వెళుతున్నారు. వాడి స్థాయికి దిగిపోయారు. భగవాన్‌కి ఒక అలవాటు ఉంది. నువ్వు ఆత్మగా ఉండు. అహంకారంగా ఉండకు, దేహంగా ఉండకు, అహంభావనగా ఉండకు. ఆత్మగా ఉంటే ఏ గొడవ లేదు. నువ్వు మనస్సుగా ఉన్నావు కాబట్టే మనస్సు గొడవలు వస్తున్నాయి. నువ్వు దేహంగా ఉన్నావు కాబట్టే దేహానికి సంబంధించిన గొడవలు వస్తున్నాయి. నువ్వు ఆత్మగా ఉంటే ఏ గొడవ లేదు. ఆత్మగా ఉండటం నేర్చుకో, నువ్వు ఏదోఒక రకంగా ఉండాలి కదా, ఆ ఉండేది ఏదో ఆత్మగా ఉండు అంతేగానీ దేహంగా ఉండకు, అహంభావనగా ఉండకు అని చెప్పే అలవాటు ఉంది భగవాన్‌కి.

అన్నిటికంటే ఉత్తమమైన లాభం, ఆత్మ లాభం. అన్ని జ్ఞానాల కంటే ఉత్తమమైన జ్ఞానం, ఆత్మజ్ఞానం. అన్ని శాంతుల కంటే ఉత్తమ శాంతి, ఆత్మ శాంతి. అందుచేత ఆ సీట్ లోంచి ఆయన దిగరు. ఉన్నది ఒక్కటే వస్తువు, నీకు తెలిసి ఉన్నా నువ్వు అదే, నీకు తెలియకపోయినా నువ్వు అదే, తెలియకపోతే దుఃఖం, తెలిస్తే సుఖం. ఆత్మ సింహాసనాన్ని ఆయన విడిచి పెట్టరు. ఆయన పదహారో సంవత్సరంలోనే ఆత్మ సింహాసనాన్ని అధిష్టించారు. ఆత్మ తప్పించి ఇంకొక గొడవే ఎత్తరు ఆయన. ఆత్మ తప్పించి ఇంకొక గొడవ ఎవరైనా ఎత్తితే, ఆ విషయాల గురించి నిన్ను ఎవరు ఆలోచించమన్నారు అనేవారు. కానీ వీడి

విషయంలో మటుకి ఆయన కూడా కిందకి దిగుతున్నారు. ఇవన్నీ చేస్తాను అనుకోండి, చేసిన తరువాత ఏమవుతుంది అని అడిగితే అప్పుడు భగవాన్ మొదలు పెడుతున్నారు, ఇప్పుడు నువ్వు దుఃఖం తోటి బాధ పడుతున్నావు. నీ దుఃఖం నశిస్తుంది, అంతకంటే నీకు ఏమి కావాలి అంటున్నారు. నీకు దుఃఖం నశిస్తుంది, ఆనందం ప్రాప్తిస్తుంది. అంతకంటే నీకు ఏమి కావాలి అయ్యా, నువ్వు ఇప్పుడు ఏమని చెబుతున్నావు అంటే, ఒక గొడవ వెళ్ళిపోయినా తరువాత ఇంకొక గొడవ వస్తుంది అంటున్నావు. ఈ గొడవలు ఏమి చేస్తున్నాయి? నీకు దుఃఖాన్ని తీసుకు వస్తున్నాయి. నీ మనస్సు ఆ గొడవల మీదకి వెళ్ళిపోతోంది కానీ దేవుడి మీదకి రావడం లేదు. దేవుడి మీద నీ మనసు ఉంటేనే కానీ ఆ దుఃఖం తొలగదు. సత్పురుషుల తోటి సహవాసం చేస్తాను అంటున్నావు. ఈశ్వరుడిని ఆరాధిస్తాను అంటున్నావు. జపం చేస్తున్నాను అంటున్నావు. అన్నీ చేస్తున్నాను అంటున్నావు. ఇవన్నీ చేసిన తరువాత ఏమవుతుంది అని అడుగుతున్నావు. అప్పుడు భగవాన్ చెబుతున్నారు. నీకు దుఃఖం నశిస్తుంది, అశాంతి నశిస్తుంది, శాంతి కలుగుతుంది, అజ్ఞానం నశిస్తుంది, జ్ఞానం కలుగుతుంది. అంతకంటే నువ్వు మటుకి కోరుకునేది ఏముంది? అంటున్నారు. నీ లక్ష్యం ఏమిటి? దుఃఖాన్ని పోగొట్టుకోవడమే కదా, నువ్వు ఏదైతే పోగొట్టుకోవాలి అనుకుంటున్నావో అది పోతుంది. నువ్వు పోగొట్టుకోవాల్సినవి పోగొట్టుకుంటే నీ స్వభావంలో ఉన్నది శాంతే. నీ అహంభావం వల్లే నీ స్వభావం నీకు దొరకడం లేదు. సత్పురుషుల సహవాసం వల్ల, ప్రాణాయామం వల్ల, ఈశ్వరుడిని ఆరాధించడం వల్ల, నీ అహంభావన నశించి నీ స్వభావం దొరుకుతుంది. నీ స్వభావంలో ఉన్నది శాంతే, నీ స్వభావంలో ఉన్నది ఆనందమే. అప్పుడు నీకు కొత్తజన్మ వస్తుంది.

రమణమహర్షి గారితోటి చిన్నప్పుడు చదువుకున్న వాళ్ళు ఎవరైనా వస్తే, ఆయన వారితోటి నీతోటి ఆడుకున్న వెంకట్రామన్ ఇక్కడ లేడు అనేవారు. నీతోటి చదువుకున్న



**భగవాన్ మౌనస్వరూపుడు. మౌనం మనకి అర్థం కానప్పుడు మాటలు చెప్పేవారు. ఆయన మౌనంగా బోధించినా, మాట్లాడినా, చూసినా ఏదైనా అనుగ్రహమే. అనుగ్రహం తప్పించి మరొకటి లేదు. మన చైతన్యస్థాయిని పెంచటం కోసం గురువు పడే కష్టం మన కళ్ళకు కనబడదు.**


వెంకట్రామన్ ఇక్కడ లేడు, వాడు చనిపోయాడు. నువ్వు ఎరుగున్నవాడు ఇక్కడ లేడు. ఇక్కడ ఉన్నవాడు ఎవడో నీకు తెలియదు. నేను చెప్పినా నీకు అర్థం కాదు. ఆత్మజ్ఞానం ఎటువంటిది అంటే మనిషిని చంపకుండా చంపే మందు ఆత్మజ్ఞానం. నీ దేహాన్ని తీసేయదు ఆత్మజ్ఞానం. నీ ముక్కులో తిరిగే గాలిని తీసేయదు ఆత్మజ్ఞానం. నీ అహంభావనని తీసేస్తుంది. అంటే ఏమిటి మీరు ఈ దేహంలో ఉండగానే అహంభావన నశించి ఆత్మజ్ఞానం ఉదయిస్తుంది. అజ్ఞానం నశిస్తుంది, జ్ఞానం ఉదయిస్తుంది. అప్పుడు మీకు కొత్తజన్మ వస్తుంది. ఆత్మజ్ఞానం నీ దేహాన్ని చంపదు. దేహానికి పరిమితం అయిన బుద్ధిని చంపుతుంది. అప్పుడు మీకు మరుసటిజన్మ వస్తుంది. ఇప్పుడు మీ దేహం ఎక్కడ ఉంటే అక్కడే ఉన్నారు అని మీరు అనుకుంటున్నారు. ఎప్పుడైతే మీకు ఆత్మజ్ఞానం కలిగిందో, ఆత్మ అంతటా ఉంది కాబట్టి మనం అంతటా ఉన్నాం అన్న సంగతి మీకు తెలుస్తుంది. ఆత్మకి చావులేదు, అందుచేత మనకి చావు లేదు అన్న సంగతి మీకు తెలుస్తుంది. ఆత్మకి పుట్టుక లేదు అందుచేత మనం పుట్టలేదు అన్న సంగతి మీకు తెలుస్తుంది. ఆత్మ యొక్క గుణాలు సత్-చిత్ ఆనందం. నీకు ఎప్పుడైతే అహంభావన నశించిందో, ఆత్మానుభవం పొందడానికి ఏ గుణాలు అయితే నీకు అడ్డుగా వస్తున్నాయో, ఆ గుణాలు ఎప్పుడైతే నశించాయో, అప్పుడు ఆ existence నీకు నేనుగా అనుభవంలోకి వస్తుంది. అందులో ఉన్నది శాంతే, అందులో ఉన్నది ఆనందమే. ఆ శాంతి ఎటువంటిది అంటే, ఆ ఆనందం ఎటువంటిది అంటే, నా నోరు చెప్పలేదు, నా మనస్సు ఊహించలేదు. అది నీ మనస్సుకి అందకపోయినా నీ అనుభవానికి అందుతుంది. అది అనుభవైకవేద్యం. అయితే ఆ అనుభవం నీకు హృదయంలో రావాలి.

భగవంతుడికి తెలియకుండా ఏది జరగదు. అందుచేత దేని గురించి మనం ఆశ్చర్య పడక్కర్లేదు. భగవాన్‌కి ఏదైనా కబురు చెప్పారు అనుకోండి ఆయనకి ఏమీ ఆశ్చర్యం కలిగేది కాదు. ఎందుచేత అంటే అనుకునేది అంతా జీవుడి సంకల్పం, జరిగేది అంతా ఈశ్వరుడి సంకల్పం. అంతా ఈశ్వర సంకల్పం ప్రకారమే జరుగుతుంది కాబట్టి ఎక్కడ ఏమి జరిగినా, ఆయనకి ఆశ్చర్యం కలిగేది కాదు. ఎందుచేత? జ్ఞాని సంకల్పం, ఈశ్వరుడి సంకల్పం వేరుగా ఉండదు. కానీ జీవుడి సంకల్పం, ఈశ్వరుడి సంకల్పం వేరుగా ఉంటాయి. జ్ఞాని అంటే ఈశ్వరుడికి వేరుగా ఉండడు. జ్ఞాని సంకల్పం, ఈశ్వరుడి సంకల్పం ఒక్కటే. మనం జ్ఞానికి పెట్టె నమస్కారం ఈశ్వరుడికి కూడా అందుతుంది. ఎందుచేత అంటే జ్ఞాని ఈశ్వరుడు కంటే వేరుగాలేడు. వాడికి వేరుభావన లేదు. వేరుభావన ఎవరికి ఉంటుంది? జీవుడికి ఉంటుంది. ఆ వేరుభావన నశించే వరకు ఈ జీవ లక్షణాలు పోవు. మనకు బేధబుద్ధి ఉన్నంతకాలం సంసారం వస్తుంది. సంసారం మళ్ళీ మనకి వస్తుందా, రాదా? మళ్ళీ మనం శవాలని మోయ్యాలా? అక్కరలేదా? మనకి రాబోయేజన్మలు ఉన్నాయా,

లేదా అని మీరు ఎవరిని అడగక్కర్లేదు. మనకి ఎంతకాలం అయితే బేధబుద్ధి ఉందో, ఎంతకాలం అయితే మనకి వేరుతనం ఉందో, అంతకాలం జన్మలు వస్తాయి, సంసారం వస్తుంది, కష్ట సుఖాలు వస్తాయి. ప్రారబ్ధం అనుభవించవలసిందే. నీలో ఆనందం ఉంది, ఆ ఆనందం నీకు అనుభవంలోకి రాకుండా అడ్డు వచ్చే విషయాలను నువ్వు తొలగించుకోవడానికే నీ యత్నం. ఆత్మానందం ఎటువంటిది? ఆత్మ శాంతి ఎటువంటిది? అది అనుభవించేటప్పుడు ఒకవేళ దేవుడు వచ్చి నీకు ఎదురుగా కనిపించినా వాడిని చూడాలి అని ఉండదు. అటువంటిది ఆత్మ శాంతి. సముద్రంలో ఎంత నీరు ఉందో, అంత ఆనందాన్ని నువ్వు అనుభవిస్తూ ఉంటావు. అంత శాంతిని నువ్వు అనుభవిస్తూ ఉంటావు. చనిపోయిన తరువాత మనం ఏమి అవుతాం అని కంగారు పడకండి. ఇప్పుడు ఏ దేవుడు ఉన్నాడు అనుకుంటున్నామో, ఆ దేవుడు మనం చనిపోయిన తరువాత కూడా ఉంటాడు. వాడు మన చెయ్యి పట్టుకుని ఎక్కడకి తీసుకు వెళ్ళాలో అక్కడకి తీసుకు పోతాడు. మీరేమి కంగారు పడకండి, భయ పడకండి. పరమేశ్వరుడి మీద మీకు ఉన్న విశ్వాసం మటుకి తగ్గకుండా చూసుకోండి నేను మిమ్మల్ని కోరేది అంతే. ఏ తలంపులు అయితే నిన్ను బాధ పెడుతున్నాయో, ఏ ఆలోచనలు అయితే నిన్ను బాధ పెడుతున్నాయో, ఏ భావాలు అయితే నిన్ను తరుముకు వస్తున్నాయో, వాటి లోంచి విడుదల పొందడానికి నువ్వు సాధన చెయ్యి, నువ్వు చెయ్యవలసింది అదే. అయితే కొంత టైము పడుతుంది.

భగవాన్ ఏమన్నారు అంటే స్వప్రయత్నం, కాల పరిపక్వం, ఈశ్వర కటాక్షం. నువ్వు చేసే ప్రయత్నం చిన్నది అయినా చెయ్యటం మానకు. నీకు ఎంత శక్తి ఉంటే అంతే చెయ్యి. నెమ్మదిగా నువ్వు ప్రయాణం చెయ్యి. నువ్వు సాధన చెయ్యగా, చెయ్యగా నీకు కాలం కలిసి వస్తుంది. కాలం కలిసి వచ్చినప్పుడు దేవుడి అనుగ్రహం నీకు వస్తుంది. అందుచేత నీ ప్రయత్నం నువ్వు చెయ్యటం మానకు, కాలం కలిసి వచ్చినప్పుడు దేవుడు నిన్ను అనుగ్రహించి ఆయన స్వరూపాన్ని నీకు ఇచ్చేస్తాడు. నీ అహంభావన ఆయన తీసుకుని ఆయన స్వరూపాన్ని నీకు ఇచ్చేస్తాడు. మీ అశాంతిని ఆయన తీసుకుని, ఆయన శాంతిని మీకు ఇస్తాడు. మీకు అర్థం అవుతోందా? మీ దుఃఖాన్ని ఆయన తీసుకుని, ఆయన ఆనందాన్ని మీకు ఇస్తాడు. అంటే పనికిరాని మీ అహంకారాన్ని నాకు ఇచ్చేయండి, పనికొచ్చే జ్ఞానాన్ని, శాంతిని మీకు ఇస్తాను అంటున్నాడు. ఈ పనికిరానిది మనం విడిచి పెట్టలేకపోతున్నాం. అందుచేత పనికొచ్చేది ఆయన ఇవ్వలేకపోతున్నాడు మనకి. మీకు అర్థం అవుతోందా? సృష్టిలో ఎందుకు పనికిరానిది అహంభావనే. అన్ని చిక్కులకి, కుటుంబంలో ఉన్న అన్ని గొడవలకి, సమాజపరంగా, గ్రామపరంగా, రాజకీయపరంగా వచ్చే అన్ని చిక్కులకి, ఈ disappointmentsకి, ఈ difficultiesకి, ఈ strugglesకి అన్నిటికీ కారణం

అహంభావనే. ఏ విషయాలు అయితే నిన్ను బంధిస్తున్నాయో, ఏ ఆకర్షణలు అయితే నిన్ను బంధిస్తున్నాయో, అవి నిన్ను విడిచి పెట్టకపోవచ్చు, భగవంతుడిని ధ్యానం చెయ్యగా, చెయ్యగా వాటిని విడిపించుకోటానికి ప్రయత్నం నువ్వు చెయ్యగా, చెయ్యగా ఏదో ఒక రోజున నెమ్మదిగా పలుచబడతాయి. నువ్వు కంగారుపడకు. తొందరగా ఊడిపోవటం లేదని ప్రయత్నం చెయ్యటం మానకు. శాంతిని విడిచి పెట్టకు. నువ్వు శాంతిగా ఉండి, కుదురుగా ఉండి, నిదానంగా ఉండి నీ సాధన ఏదో నువ్వు చేసుకో, నీ ప్రయత్నం ఏదో నువ్వు చేసుకో, కానీ నువ్వు ప్రయత్నం మానకు. అంటే ప్రయత్నం అనేది ఎంత naturalగా చేసే స్థితికి మనం వచ్చేయాలి అంటే నీ ముక్కులో గాలి నీ ప్రయత్నం లేకుండా ఎంత సహజంగా తిరుగుతోందో నీ సాధన కూడా అంత naturalగా, అంత normalగా జరిగిపోతూ ఉండాలి. అప్పుడు ఈశ్వరుడు స్వరూపం నీకు ఇస్తాడు. కొంతమంది అరగంట సాధన చేసి, రెండు గంటల సేపు నేను సాధన చేశాను, నేను సాధన చేసాను అని కర్తృత్వం పెంచుకుంటారు. అహంభావన పెంచుకుంటారు అలా కాదు, నేను ముక్కులో గాలి పీల్చుకుంటున్నాను. విడిచి పెట్టేస్తున్నాను, నేను గొప్ప పని చేశాను అని ఎవరైనా అంటారా? ఇవాళ ఉదయం నేను స్నానం చేశాను, ఎవరు చేయలేని పని నేను చేశాను అని ఎవరైనా అంటారా? అది గొప్ప కాదు. అవి naturalగా చేసే పనులే. అంత naturalగా, అంత normalగా నువ్వు సాధన చేస్తే నువ్వు తరిస్తావు. ఇది ఇక్కడ భగవాన్ చెప్పేది. అంతేకానీ పావుగంట నువ్వు సాధన చేసి, గంటసేపు గొప్ప సాధన చేశాను, అని చెప్పకుంటే మీకు ఏమి అవుతుంది? మీకు ప్లస్ మార్కులు రెండు, మైనస్ మార్కులు పది పడతాయి. అలా కాదు, నువ్వు చేసేది కృత్రిమంగా చెయ్యకూడదు, నువ్వు చేసేది normalగా చెయ్యాలి. నువ్వు చేసేది naturalగా చెయ్యాలి. ఒకవేళ నీకు ఏదైనా మంచితనం ఉంటే నీకున్న మంచితనం నీకు కూడా తెలియకూడదు. అటువంటి మంచితనం నీకు ఉండాలి. కొంతమంది మంచివాళ్ళు ఉంటారు, మేము మంచివాళ్ళం, మేము మంచివాళ్ళం అని చెప్పకుంటారు. కొంతమంది తెలివైన వాళ్ళు ఉంటారు, మేము తెలివైన వాళ్ళం, తెలివైన వాళ్ళం అని చెప్పకుంటారు. అలా కాదు. మీకున్న తెలివి మీకే తెలియకూడదు, మీకున్న మంచితనం మీకే తెలియకూడదు. మీకున్న మంచితనం మీకు తెలుస్తుంటే, మీకున్న తెలివి మీకు తెలుస్తుంటే, మీకు రజోగుణం పెరుగుతుంది, తమోగుణం పెరుగుతుంది అంటున్నారు ఆచార్యులస్వామివారు. మీకు అర్థం అవుతోందా? అస్తమాను మీకున్న డబ్బు మీకు జ్ఞాపకం వస్తుంటే, మీకున్న తెలివితేటలు మీకు జ్ఞాపకం వస్తుంటే, మీరు చేసిన దానాలు మీకు జ్ఞాపకం వస్తుంటే, మీరు చేసిన మంచి పనులు మీకు జ్ఞాపకం వస్తుంటే, మీకు సత్వగుణం పెరగదు, రజోగుణం పెరుగుతుంది. ఈ రజోగుణం మీ మనస్సుని బాహ్యాముఖానికి తీసుకుని వెళ్తుంది, చీకటి లోకాలకి తీసుకు పోతుంది. మీరు మంచి చేసినా మాట నిజమే కానీ నేను మంచి చేశాను, నేను మంచి చేశాను, అని మీరు



జ్ఞానికి శరీరం ఉన్నా ఒకటే, లేకపోయినా ఒకటే. శరీరం ఉంటే దానికి చాకిరీ చెయ్యాలి. జ్ఞానికి శరీరం లేకపోయినా ఆయన అస్తిత్వానికి భంగం లేదు. శరీరం ఉన్నప్పుడు కూడా వారు శరీరం కాదు. వారి ద్వారా ఏ శక్తి అయితే పని చేస్తోందో ఆ శక్తికి చావు లేదు. శరీరం లేకపోయినా అది పనిచేస్తూనే ఉంటుంది.

## రమణ భాస్కర చందాదారులకు విన్నపం

**రమణ భాస్కర శాశ్వత చందా (10 సం॥లకు) రు॥ 1200/-లు**. రమణ భాస్కర శాశ్వత చందాదారులుగా చేరి పత్రికను ప్రోత్సహించవలసినదిగా కోరుచున్నాము.

**సంవత్సర చందా రు॥ 150/-లు**. సంవత్సర చందాదారులకు చందా గడువు ముగిసినది. మీ చందాను స్వయంగా గానీ లేక

**శ్రీ రమణక్షేత్రం, యూనియన్ బ్యాంక్ ఆఫ్ ఇండియా, యడ్ల బజార్, పాలకొల్లు బ్రాంచి**

అకౌంట్ నెంబర్ **520101264185724** **(IFSC Code : UBIN0827533)** నందు గాని చెల్లించగలరు. చందాను **బ్యాంక్ అకౌంట్‌లో జమచేసినవారు** జమచేసిన తేదీ, వారి అడ్రసును **9866715896** ఫోన్ నెంబరుకు తెలియపరచగలరు.

# భగవాన్ శ్రీరమణమహర్షి

ప్రతి సంవత్సరం మాదిరిగానే ది॥ 28-12-2023న భగవాన్ శ్రీరమణమహర్షి 144వ జయంతిని జరుపుకోబోతున్నాం. మన గురువు, గురువైన ఆధునిక మహర్షి భగవాన్ శ్రీరమణుని జయంతిని జరుపుకోవడం మనందరికి మహత్తర అవకాశం. తారీఖు ప్రకారం డిసెంబరు 30 1879న పునర్వసు నక్షత్రమునందు మధురైకి 70 కీ॥మీ॥ల దూరములో ఉన్న తిరుచ్చుళి గ్రామంలో అళగమ్మ, సుందరం అయ్యరు పుణ్య దంపతులకు రెండవ సంతానముగా భగవాన్ దేహాన్ని ధరించారు. తల్లితండ్రులు ఆ బాలునికి పెట్టిన పేరు వేంకటరామన్. ఆయన ఉన్నత పాఠశాల విద్యాభ్యాసము మధురైలో జరిగింది. తన 15వ ఏట ఒక బంధువు ద్వారా 'అరుణాచలం' అన్న పదమును వినుట జరిగింది. అప్పటి నుండి వేంకటరామన్‌ను అరుణాచల స్ఫురణ వీడలేదు. ఆ తరువాత ఆయన పెరియ పురాణం అనే పుస్తకం చదువుట జరిగింది. చదివినకొలది ఆ భక్తులతో తాను తాదాత్మ్యం చెంది, వారి కష్టములకు పరితపించి, వారి జయములకు సంతోషించి వారికి శివదర్శనము కలిగిన తనకు ఆ దర్శనభాగ్యము లభించినట్లే భావించెను. తరువాత కాలములో ది॥ 16-07-1896న తన 17వ ఏట ఒకనాడు మధురైలో పినతండ్రి గారి ఇంట్లో మేడమీద గదిలో 'అమృతానుభవం' కలిగింది. అట్టి ఆత్మానంద రసానుభవము తరువాత అందు మునిగి ఉండడం తప్ప, వేంకటరామన్‌కి వేరే పని సాధ్యము కావడము లేదు. తరువాత కాలములో ఆగష్టు 29, 1896న ఇల్లు విడిచిపెట్టి సెప్టెంబరు 1, 1896న పవిత్ర అరుణాచలం చేరుకుని అరుణాచలేశ్వరుడికి 'అప్పా నీ ఆజ్ఞ మేరకు వచ్చాను' అని తనను తాను సమర్పించుకున్నాడు. తరువాత కొన్ని నెలలు దేవాలయములోనే అనేక స్థలములలో ఉండి పిమ్మట గురుమూర్తము నందు మామిడి తోపులో ఇలా నివసించి, తరువాత 16 సంవత్సరములు విరూపాక్ష గుహలో ఉండి తరువాత స్కందాశ్రమమునకు మారుట జరిగింది. ఉద్దండి నాయనారు, తంబిరాను, పళనిస్వామి మొదలగు భక్తులు స్వామి భక్తిని గమనించి, తమను శిష్యులుగా భావించుకుని స్వామిసేవ చేయుచుండిరి. విరూపాక్ష గుహలో ఉండగా రమణుని కీర్తి విశ్వవ్యాప్తమైనది. పండితులు, పామరులు, సంశయగ్రస్తులు, జిజ్ఞాసువులు, దేశ విదేశముల నుండి ఆయన దర్శనమునకై వచ్చుట జరిగింది. 1907లో శ్రీకావ్య కంఠ గణపతి శాస్త్రిగారు స్వామిని దర్శించి తన సంశయములను నివృత్తి చేసుకుని ఆయనకు 'భగవాన్ శ్రీరమణమహర్షి' అని నామకరణం చేయుట జరిగింది. 1922 మే 19న భగవాన్ తల్లి అళగమ్మగారికి ముక్తిని ప్రసాదించారు, ఆమె సమాధి గిరికి క్రింద దక్షిణ భాగాన వెలసినది. తరువాత భగవాన్ శాశ్వతముగా క్రిందికి వచ్చి ఉండిపోయారు, క్రమముగా ఇది 'శ్రీరమణాశ్రమము'గా ప్రసిద్ధి గాంచినది. భగవాన్ శ్రీరమణుని సమత్వము, సకల ప్రాణికోటి పట్ల ఆయనకు గల ప్రేమ, దయను వర్ణించడానికి మాటలు చాలవు. "హరి మొదలు అన్ని జీవుల హృదయ గుహ యందు ఉన్న అరుణాచలుడే రమణుడు" అని చెప్పారు భగవాన్. 1950 ఏప్రియల్ 14 రాత్రి గం॥ 8-47 ని॥లకు ఆయన దేహము నుండి ఒక కాంతి ఉదయించి అరుణగిరి శిఖరమునందు ఐక్యమయింది. రమణజ్యోతి అరుణజ్యోతిగా మారిపోయింది. భగవాన్ శ్రీరమణుని ఉపదేశామృతం సద్గురువు శ్రీనాన్నగారు అనేక సంవత్సరాలు మనకు అందించారు. భగవాన్ శ్రీరమణమహర్షి యొక్క జ్ఞానవైభవాగ్ని, బోధను మనందరికి అందించి శాంతి సముద్రములో ఓలలాడించిన సద్గురువు శ్రీనాన్నగారికి మనము ఎల్లప్పుడు ఋణపడి ఉంటాము.

**- చావలి సూర్యనారాయణమూర్తి, అమలాపురం, సెల్ : 9963195064**